
సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)
శనివారం । 12 । జూలై । 2025



విద్యుత్ అంతరాయాలు తగ్గాలి

విద్యుత్ అంతరాయాలు తగ్గి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు.

- 8లో ▸



పెరుగుతున్న గోదావరి

ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటితో గోదావరి వరద ప్రవాహం పెరుగుతోంది. దీంతో ములుగు జిల్లాలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33°/26°

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ సాధారణంగా ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నిట్‌లో ముగిసిన సమ్మర్ ఇంటర్న్‌షిప్-2025



కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో సమ్మర్ ఇంటర్న్‌షిప్-25 ప్రోగ్రాం శుక్రవారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ హాజరై సమ్మర్ ఇంటర్న్‌షిప్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. నిట్ వరంగల్‌లో తొలిసారిగా మే 9వ తేదీన ప్రవేశపెట్టిన సమ్మర్ ఇంటర్న్‌షిప్‌నకు అనూహ్య స్పందన లభించిందని, యూజీ, పీజీ నుంచి 194 విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఇక ప్రతిఏటా సమ్మర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ అకడమిక్, ప్రొఫెసర్ వెంకయ్య చౌదరి, ప్రొఫెసర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

15,16న క్రీడా శిక్షణ కేంద్రాల్లో ప్రవేశాలకు ఎంపిక

వరంగల్ స్పోర్ట్స్: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, ఎల్‌బీ స్టేడియంలో గల క్రీడా శిక్షణ కేంద్రాల్లో ప్రవేశాలకు ఈ నెల 15, 16వ తేదీల్లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26వ సంవత్సరానికి నిర్వహించే ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 12 నుంచి 16 ఏళ్ల మధ్య వయస్సు కలిగి తెలంగాణ క్రీడాకారులై ఉండాలని సూచించారు. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్న వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. క్రీడా సర్టిఫికెట్లు, స్టడీ, పుట్టిన తేదీ, 10 పాస్‌పోర్టు సైజు ఫొటోలతోపాటు ఆధార్ కార్డు లేదా నివాస ధ్రువీకరణ పత్రాలతో గచ్చిబౌలి, ఎల్‌బీ స్టేడియం వద్ద హాజరు కావాలని సూచించారు.

అంకితభావంతో పనిచేయాలి



న్యూశాయంపేట : విద్యార్థుల పురోగతికి అధ్యాపకులు అంకితభావంతో పనిచేయాలని హనుమకొండ జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి కే.ఏ.గౌస్ హైదర్ తెలిపారు. శుక్రవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని మైనార్టీ గురుకుల బాలుర కళాశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులకు అందజేస్తున్న మెడిసిన్ కిట్‌ను పరిశీలించి, కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శిరీష, అధికారులు సయ్యద్ అక్బర్, మక్బూల్ పాష, అధ్యాపకులు పద్మ, ఆయేషా పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విద్యారణ్యపురి : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శిగా నామినేషన్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ డి.వాసంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులకు 2025-26, 2026-27 సంవత్సరాలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శిగా నామినేషన్ కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈనెల 30వ తేదీ వరకు పూర్తిచేసిన దరఖాస్తులను హనుమకొండలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

దివ్యాంగులకు ఆర్థిక ప్రోత్సాహం..

కాజీపేట అర్బన్ : దివ్యాంగులకు ఎకనామికల్ రిహాబిలిటేషన్ స్కీంకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హనుమకొండ జిల్లా స్త్రీ,శిశు సంక్షేమాధికారి జయంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులకు ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందజేసేందుకు వందశాతం రాయితీతో 18 యూనిట్లు (రూ.50వేలు), 70శాతం సబ్సిడీతో లక్ష రూపాయలకు గాను 1 యూనిట్, 60శాతం సబ్సిడీతో రూ.3లక్షలకు గాను 1 యూనిట్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో tgobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 14నుంచి 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.


బాల పురస్కార్‌కు..

ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ జాతీయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ,శిశు సంక్షేమాధికారి జయంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 సంవత్సరానికిగాను 18 ఏళ్లలోపు బాలబాలికలు ఆవిష్కరణ, సృజనాత్మకత, సామాజిక సేవ, సేవ, పర్యావరణ పరిరక్షణ, క్రీడలు, కళలు, సంస్కృతి, సైన్స్ అండ్ టెక్నాలజీ తదితర రంగాల్లో ప్రతిభ కనబరిచిన బాలలు ఆన్‌లైన్‌లో awards.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 30 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత పత్రాలను దరఖాస్తుకు జతపరిచి హనుమకొండ కలెక్టరేట్ లోని జీ-1,జీ-2 గదుల్లోని జిల్లా స్త్రీ,శిశు సంక్షేమాధికారి కార్యాలయంలో అందజేయాలని కోరారు.

నల్లా.. కలెక్షన్లు!

'గ్రేటర్'లో చేయి తడిపితేనే నీటి కుళాయి కనెక్షన్ మంజూరు

- నేరుగా దరఖాస్తు చేసుకుంటే నెలలు ఆగాల్సిందే
- సీజీజీతోనే కష్టాలు అంటున్న బల్దియా ఇంజనీర్లు
- నగరంలో సాగుతున్న నీటి చౌర్యం
- చోద్యం చూస్తున్న పాలకవర్గం పెద్దలు, ఉన్నతాధికారులు



వరంగల్ అర్బన్ : వరంగల్ మహానగరంలో అక్రమ నీటి కనెక్షన్ల వ్యవహారంలో బల్దియా ఇంజనీర్ల వైఖరిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొత్త ఇల్లు కట్టుకున్న యజమాని నల్లా కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే మంజూరుకు కనీసం నెల నుంచి 6 నెలల సమయం పడుతోంది. నిత్యావసరమైన నీటి అవసరాల రీత్యా క్షేత్రస్థాయిలో లైన్‌మెన్, వర్క్ ఇన్‌స్పెక్టర్లకు ఎంతో కొంత ముట్టజెప్పి కనెక్షన్ తీసుకోవడం నగరంలో సాధారణమైంది.

సిటిజన్ చార్టర్ ఏమంటుందంటే..

కొత్త నల్లా కనెక్షన్ కోసం నగర వాసులు నెలల తరబడి బల్దియా ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయాల చుట్టూ తిరగొద్దు. సిటిజన్ చార్టర్ ప్రకారం 7 రోజుల్లో మంజూరు చేయాలి. వెంటనే కనెక్షన్ ఇవ్వాలి. కానీ బల్దియా ఇంజనీర్ల నిర్లక్ష్యంతో నెలలు గడిచిపోతున్నాయి. కానీ నల్లా నీళ్లకు నోచుకోక ప్రజలు విసిగెత్తి చౌర్యానికి పాల్పడుతున్నారు.

సీజీజీ పేరుతో దాటవేత

2019లో కమిషనర్‌గా గౌతమ్ పనిచేసిన కాలంలో కొత్త నల్లా కనెక్షన్ల జారీలో సింగిల్ విండో సిస్టమ్ అమల్లోకి తీసుకొచ్చారు. దరఖాస్తు చేసుకున్న రెండు, మూడు రోజుల్లో ఏఈ స్థాయిలో జారీ ప్రక్రియ కొనసాగుతుండేది. ఆయన బదిలీ తర్వాత కొద్ది రోజులకే ఈ విధానాన్ని ఎత్తివేశారు. తదుపరి 2023 నుంచి సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) అమల్లోకి వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా కొత్త ఇంటినంబర్లు, పేరు మార్పిడిలు, ఆస్తుల విభజన, ట్రేడ్‌లైసెన్స్, నల్లా కనెక్షన్లు తదితర అంశాలు అన్నీ ఒకే గొడుగుకు కిందికి తీసుకొచ్చారు. సీజీజీలో సాంకేతిక లోపం కారణంగా ఆలస్యమవుతుందని ఇంజనీర్లు దాటవేస్తున్నారు. బల్దియా ఐటీ విభాగం నిపుణులను ప్రశ్నిస్తే సీజీజీ ఒక కారణమైతే ఇంజనీర్లు పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇలా ఎవరికి వారు కొత్త నల్లా కనెక్షన్ల జారీలో అలసత్వం ప్రదర్శిస్తుండటం పట్ల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

నగరంలోని ప్రగతి నగర్‌కు చెందిన వెంకటేశ్వర్లు ఇటీవల భవన నిర్మాణ ధ్రువీకరణ పత్రాన్ని పొంది, ఇంటినంబర్ తీసుకుని కొత్త నల్లా కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. ఆరు నెలలు గడించింది. ఇంతవరకు కనెక్షన్ ఇవ్వలేదు.

పలివేల్పులకు చెందిన బి.సుజాత నల్లా కనెక్షన్ కోసం మూడు నెలలుగా దరఖాస్తు చేసి బల్దియా చుట్టూరా కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. కానీ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ)లో సాంకేతిక సమస్య వల్ల మంజూరు ఇవ్వలేకపోతున్నామని ఏఈ చెబుతున్నారు.

శివనగర్‌కు చెందిన మురళీ నల్లా కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోగా, ఇప్పట్లో మంజూరయ్యే పరిస్థితి లేదని, రూ.5వేలు ఇస్తే మంజూరవుతుందని చెప్పి డబ్బు ఇచ్చాక కనెక్షన్ ఇప్పించాడు.

... ఇలా నగరంలో కొత్త నల్లాల జారీలో తీవ్ర జాప్యం ఏర్పడుతుండటంతో దళారులకు, లైన్‌మెన్లకు కాసుల పంట పడుతోంది. 50, 100 కనెక్షన్లు కాదు.. గత మూడు నెలల కాలంలో సుమారు 850 నల్లా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో నల్లా నీళ్ల కోసం ప్రజలు అడ్డదారులు తొక్కాల్సిన పరిస్థితులకు వారే కల్పిస్తుండటం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అడ్డదారిలో అనుమతులు..

కొత్త నల్లా కనెక్షన్ల జారీలో జాప్యం అవుతుండడం, నీటి అవసరం ఉండడంతో నగరవాసులు మధ్యవర్తులుగా లైన్‌మెన్లను ఆశ్రయిస్తున్నారు. ఒక్కో కనెక్షన్‌కు రూ.3వేల నుంచి రూ.5వేల వరకు గుంజుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికే నగరవ్యాప్తంగా సుమారు 13వేల అక్రమ నల్లా కనెక్షన్లు ఉన్నట్లు ఇంజనీర్ల విచారణలో తేలింది. కొత్తవి మంజూరులో జాప్యం కారణంగా అక్రమ కనెక్షన్లు పెరిగిపోతున్నాయి. ఈ విషయమై బల్దియా ఇంజనీర్లను వివరణ కోరితే ఈఈల బదిలీ కారణంగా లాగిన్‌లు సకాలంలో కావడం లేదు.. దీంతో కనెక్షన్ల మంజూరులో జాప్యం జరుగుతున్న విషయం వాస్తవమేనని అంగీకరించడం గమనార్హం.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే నాయిని, కలెక్టర్ స్నేహశబరీష్

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ అర్బన్ : అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గస్థాయిలో ఇందిరమ్మ, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, కాజీపేట ఆర్వోబీ నిర్మాణ పనుల పురోగతి, భద్రకాళి చెరువు పూడిక తీత పనులపై హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిలతో కలిసి రెవెన్యూ, మున్సిపల్, గృహ నిర్మాణ, ఆర్‌అండ్‌బీ, సాగు నీటిపారుదల శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాజీపేట ఆర్వోబీ పనులను అధికారులు, కాంట్రాక్ట్ సంస్థ సమన్వయంతో త్వరగా పూర్తిచేయాలన్నారు. సమావేశంలో హనుమకొండ ఆర్డీఓ రమేష్, హౌసింగ్ పీడీ రవీందర్, ఆర్ అండ్‌బీ ఈఈ సురేష్‌బాబు, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, సాగునీటి పారుదలశాఖ ఈఈ శంకర్, తహసీల్దార్లు రవీందర్ రెడ్డి, బావ్‌సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ 4వ డివిజన్ పరిధిలోని జ్యోతిబసు నగర్, అక్షరకాలనీల్లో రూ.75 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు శుక్రవారం పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..గతంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లకు నిధులు ఇవ్వలేదని, కానీ తమ ప్రజా ప్రభుత్వంలో పక్షపాతం లేకుండా నిధులు మంజూరు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్ బొంగు అశోక్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సంతానంపై అవగాహన పెరిగింది

- హనుమకొండ డీఎంహెచ్‌ఓ అప్పయ్య



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య

హన్మకొండ చౌరస్తా : తెలంగాణలో సగటు సంతానోత్పత్తి రేటు 1.6కు చేరుకుందని, దంపతులకు సంతానంపై అవగాహన పెరిగిందని హనుమకొండ డీఎంహెచ్‌ఓ అప్పయ్య పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ జనాభాలో భారత్ మొదటి స్థానంలో ఉందని, ఈ ఏడాది థీమ్ ప్రణాళికాబద్ధమైన మాతృత్వం కోసం గర్భధారణ, మానసిక, శారీరక ఆరోగ్యంపై దంపతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అంతకుముందు పోచమ్మకుంట, పెద్దమ్మగడ్డ ఆరోగ్య కేంద్రాలు, పట్టణ కుటుంబ సంక్షేమ కేంద్రం వైద్య సిబ్బంది, సెయింట్ ఆన్స్ నర్సింగ్ విద్యార్థులతో కలిసి నిర్వహించిన ర్యాలీని డీఎంహెచ్‌ఓ జెండా ఊపి ప్రారంభించారు. జీఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ మదన్‌మోహన్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమయపాలన పాటించకపోతే చర్యలు

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్



బల్దియా అకౌంట్స్ విభాగాన్ని తనిఖీ చేస్తున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

వరంగల్ అర్బన్ : ప్రజలు చెల్లించే పన్నులతో జీతాలు తీసుకుంటున్నామని, నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరించకపోతే ఎందుకు?.. ఫైళ్లు పెండింగ్‌లో ఉండడం సరికాదని గ్రేటర్ వరంగల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం బల్దియా ప్రధాన కార్యాలయంలోని జనరల్ అడ్మినిస్ట్రేషన్, ప్రజారోగ్యం, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, అర్బన్ మలేరియా, అకౌంట్ సెక్షన్, ట్రెజరీ, ఇన్‌వార్డు, కంట్రోల్ రూమ్ తదితర విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అర్బన్ మలేరియా విభాగంలోని ఔట్‌సోర్సింగ్ కార్మికుడు ఇయర్‌ఫోన్‌తో మాట్లాడుతున్న తీరును గుర్తించిన కమిషనర్ వివరాలు ఆరా తీసి నెల వేతనంలో కోత విధించాలని ఆదేశించారు. ప్రజారోగ్యం, అడ్మినిస్ట్రేషన్ విభాగాల్లో సిబ్బంది లేకపోవడంపై ఆరా తీయగా, రేషన్ కార్డుల లబ్ధిదారుల ఎంపికలో ఉన్నారని సిబ్బంది తెలియజేశారు. ఆయా అంతస్తులోని పలు విభాగాల్లో మరమ్మతులు నిర్వహించేందుకు వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని అదనపు కమిషనర్‌ను ఆదేశించారు. ఫేస్ ఆధారంగా బయోమెట్రిక్ హాజరును అమల్లోకి తీసుకురావాలని ఐటీ విభాగం సిబ్బందికి సూచించారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజిరెడ్డి, ఎంహెచ్‌ఓ రాజేష్, పర్యవేక్షకులు ఆనంద్, రామకృష్ణ, దేవేందర్, ఐటీ మేనేజర్ రమేశ్ తదితరులు ఉన్నారు.

9999 @ రూ.11 లక్షలు

- వాహన ఫ్యాన్సీ నంబర్‌కు వెచ్చించిన ఓ వ్యాపారి



ఫ్యాన్సీ నంబర్ 9999

ఖిలా వరంగల్ : వరంగల్ నగరానికి చెందిన ఓ వ్యాపారి అధిక మొత్తంలో చెల్లించి ఫ్యాన్సీ నంబర్‌ను దక్కించుకున్నట్లు వరంగల్ ఇన్‌చార్జ్ ఆర్టీఓ శోభన్‌బాబు శుక్రవారం తెలిపారు. కారు నంబర్ ప్లేట్‌పై తనకు నచ్చిన లక్కీ నంబర్ ఉండాలనే ఆశతో 9999 ఫ్యాన్సీ నంబర్‌ను ఆన్‌లైన్ ద్వారా రూ.11,09,999లు చెల్లించి హర్ష కన్‌స్ట్రక్షన్స్ పేరు మీద దక్కించుకున్నట్లు వివరించారు. ఇంత మొత్తం ఖర్చు చేసి నంబర్ దక్కించుకోవడంపై ఆర్టీఓ అధికారులు సైతం అవాక్కయ్యారు. సదరు వ్యాపారి ఫ్యాన్సీ నంబర్ కోసం చాలా రోజులుగా ప్రయత్నిస్తూ ఈసారి అధిక మొత్తం వెచ్చించి దక్కించుకున్నట్లు చెప్పారు.

ప్లాస్టిక్ విక్రయిస్తే రూ.లక్ష జరిమానా..

- విధించాలని మేయర్, కమిషనర్ ఆదేశం



సెప్టిక్ ట్యాంక్ సిబ్బందికి పీపీ కిట్లు అందజేస్తున్న మేయర్ సుధారాణి, చిత్రంలో కమిషనర్

వరంగల్ అర్బన్ : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయించే షాపు యజమానులకు రూ.లక్ష వరకు జరిమానా విధించడంతోపాటు రవాణా చేసే వాహనాలను, షాపులను సీజ్ చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌లు అధికారులకు సూచించారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజారోగ్య విభాగం, ఆస్కీ సంయుక్త ఆధ్వర్యంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్, సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ అంశాలపై డీ స్లడ్జింగ్ ఆపరేటర్లతో మేయర్, కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 120 మైక్రాన్ కన్నా తక్కువ మందం గల ప్లాస్టిక్ వాడితే పర్యావరణంతోపాటు మానవ ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. ప్లాస్టిక్‌పై ఫిర్యాదులకు 14420 టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంటుందన్నారు. బల్దియా పరిధి 44వ డివిజన్ అమ్మవారిపేటలో నగర అవసరాలకు అనుగుణంగా 150 కేఎల్‌డీ సామర్థ్యంతో నిర్మిస్తున్న మానవ వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రం సిద్ధమైందన్నారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేయించుకోవాలని సూచించారు. అనంతరం సెప్టిక్ ట్యాంక్ సిబ్బందికి పీపీ కిట్లు అందజేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేష్, ఆస్కి కోఆర్డినేటర్ రాజమోహన్‌రెడ్డి, శ్వేత, స్లడ్జింగ్ ఆపరేటర్లు, నగరంలోని వర్తక, వాణిజ్య వ్యాపారస్తులు పాల్గొన్నారు.

పచ్చదనమే లక్ష్యంగా..!

- హరితహారానికి అధికారుల కసరత్తు
- హనుమకొండ జిల్లాలో టార్గెట్ 8లక్షలు, వరంగల్ జిల్లాలో 31లక్షలు
- ఈ మేరకు నర్సరీల్లో సిద్ధంగా ఉన్న మొక్కలు



గుడెప్పాడ్ నర్సరీలో పెరుగుతున్న మొక్కలు

సాక్షి, వరంగల్/హన్మకొండ అర్బన్ : వరంగల్, హనుమకొండ జిల్లాల్లో పచ్చదనం పెంపొందించే దిశగా అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు మహాక్రతువు చేస్తున్నారు. 2025–26 సంవత్సరానికి గాను హనుమకొండ జిల్లాలో 8 లక్షల మొక్కలు నాటే లక్ష్యంతో కార్యాచరణ కొనసాగుతోంది. డీఆర్‌డీఓ పరిధిలోని 12 మండలాలకు గాను 208 నర్సరీల్లో మొత్తం 14.50 లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. ఈ ఏడాది నాటనున్న మొక్కల్లో మామిడి, జామ, నేరేడు, ఉసిరి, తులసి, గరగ, నిమ్మ వంటి పండ్ల మొక్కలు, ఔషధ గుణాలున్న మొక్కలు ఉన్నాయి. పల్లె ప్రకృతి వనాలు, మినీ వనాలు ఏర్పాటు ద్వారా గ్రామీణాభివృద్ధికి పచ్చదనాన్ని చేర్చేందుకు చర్యలు చేపట్టనున్నారు. మొక్కల సంరక్షణకు సముచితమైన పద్ధతులు పాటించాలని, ప్రజల సహకారం అవసరమని డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాస్ తెలిపారు. గ్రామస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, యువత, మహిళా సంఘాలు అందరూ కలిసి ఈ హరిత ఉద్యమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

వరంగల్ జిల్లాలో న్యూట్రిషన్ గార్డెన్స్..

వరంగల్ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మేరకు వన మహోత్సవంలో భాగంగా 26 ప్రభుత్వ విభాగాల ఆధ్వర్యంలో 31,04,272 మొక్కలు నాటి వరంగల్ జిల్లాను పచ్చలహారం చేసేందుకు కార్యాచరణ రూపొందించారు. జిల్లాలోని 337 నర్సరీల్లో 32,02,510 మొక్కలు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా అటవీశాఖ.. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో న్యూట్రిషన్ గార్డెన్స్ ఏర్పాటుచేసే దిశగా చర్యలు చేపట్టింది. బడుల్లో నాటిన ఔషధ మొక్కలు పిల్లలకు పోషకాహార భద్రతతోపాటు వైద్య అవసరాలు కూడా తీర్చే వీలుంది. ఈ గార్డెన్స్‌లో కలబంద, తులసి, వేప, మెంతులు, అల్లం పలు రకాల మొక్కలు నాటనున్నారు. దీంతో పిల్లలకు ఆరోగ్యంపై అవగాహన కలిగించడంతోపాటు అక్కడ గడపడం వల్ల ఆరోగ్యకర వాతావరణం కల్పించే వీలుంటుందని అధికారులు భావిస్తున్నారు.

పద్మాక్షి అమ్మవారికి పుష్పార్చన



పుష్పాలంకరణలో పద్మాక్షి దేవి

హన్మకొండ అర్బన్ : శాకంబరీ ఉత్సవాల్లో భాగంగా నగరంలోని పద్మాక్షి కాలనీలో గల శ్రీ హనుమద్గిరి పద్మాక్షి అమ్మవారికి శుక్రవారం పుష్పార్చన నిర్వహించినట్లు అర్చకులు నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని, శంకర్ శర్మ తెలిపారు. పద్మాక్షి అమ్మవారికి తీరొక్క పూలతో అలంకరించి హారతి ఇచ్చినట్లు పేర్కొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించగా 7వ డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, కాకతీయ ఆస్పత్రి యాజమాన్యం డాక్టర్ ప్రవీణ్-నీరజ దంపతులు ప్రారంభించినట్లు తెలిపారు. ఆలయ ట్రస్ట్ కోశాధికారి శ్యాంసుందర్‌రెడ్డి, కార్యదర్శి నీలారపు రాజ్‌కుమార్, సభ్యులు విక్రమ్, సదానందం, వెంకట్, భక్తులు పాల్గొన్నారు.

నిరాదరణ బాలలకు 'సాథి' సేవలు

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్ పాండే



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్ పాండే

వరంగల్ లీగల్ : సమాజంలో నిరాదరణకు గురైన బాలలకు సాథితో ఆధార్, ఇతర సేవలు అందుతాయని హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి క్షమాదేశ్ పాండే తెలిపారు. శుక్రవారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సాథి క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్షమాదేశ్ పాండే మాట్లాడుతూ.. ఈ క్యాంపెయిన్ ద్వారా జిల్లాలోని నిరాదరణకు గురైన బాలలు, అనాథలు, దివ్యాంగులు, ఇతర కారణాల వల్ల ఒంటరి పిల్లలకు ప్రభుత్వ సేవలు, పథకాలు, విద్యా, ఆరోగ్య, సంరక్షణ, పునరావాస చర్యలు నేరుగా కల్పించేందుకు కావాల్సిన గుర్తింపు కార్డులు జారీకి క్యాంపుల నిర్వహణ, సర్వే చేయడానికి తగిన కార్యాచరణ రూపొందించినట్లు పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో క్యాంపుల నిర్వహణకు వివిధ ప్రభుత్వ అధికారులు, సంస్థలు, పారా లీగల్ వలంటీర్లు, ప్యానెల్ లాయర్స్‌తో కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రంజిత్ కుమార్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ప్రవీణ్ కుమార్, ఎన్జీఓ ప్రతినిధులు ఎర్ర శ్రీకాంత్, కళ్యాణ్, సుజాత రెడ్డి, ప్యానెల్ అడ్వకేట్స్, పారాలీగల్ వలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌రేల సామర్థ్యం పెంచాలి

- టీబీ ఆస్పత్రిని తనిఖీ చేసిన కలెక్టర్



టీబీ ఆస్పత్రిలో పరిశీలిస్తున్న కలెక్టర్ స్నేహశబరీష్

నయీంనగర్ : టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా హనుమకొండలోని టీబీ ఆస్పత్రిలో ప్రజలకు నిర్వహిస్తున్న పరీక్షలు, ఎక్స్‌రేల తీరును శుక్రవారం కలెక్టర్ స్నేహ శబరీష్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఎన్ని ఎక్స్‌రే మిషన్లు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. రోజు వారీగా ఎక్స్‌రేల సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. ఇంకా ఎక్కువ ఎక్స్‌రేలు తీసేందుకు పీహెచ్‌సీల్లో రేడియోగ్రాఫర్ ఉంటే టీబీ ఆస్పత్రికి డిప్యూట్ చేయాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. అనంతరం డయాగ్నోస్టిక్స్, ఎక్స్‌రే మిషన్, ఓపీ విభాగాలను పరిశీలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న వారికి ముందుగా నెలకు సరిపడా పోషకాహార కిట్ అందించాలని, మిగతా కాలంలో కూడా వారికి కిట్ అందించే దిశగా ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ అప్పయ్య, టీబీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, క్షయ నియంత్రణ అధికారి హిమబిందు, టీహబ్ మేనేజర్ కౌముది, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

సర్వీస్ బుక్స్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్



విద్యారణ్యపురి : హనుమకొండ జిల్లాలోని 2002 డిసెంబర్ 31వరకు నియమితులై విధులు నిర్వర్తిస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు శుక్రవారం డీఈఓ కార్యాలయంలో సర్వీస్ బుక్స్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారు. మొత్తం ఎనిమిది కౌంటర్లను ఏర్పాటుచేసి వెరిఫికేషన్ చేశారు. అన్ని సబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్లు మొత్తంగా 369మంది ఉండగా వెరిఫికేషన్ ప్రక్రియకు 329 మంది ఎస్ఏలు హాజరయ్యారు. 40 మంది గైర్హాజరయ్యారు. ఈ ప్రక్రియ శుక్రవారం రాత్రి 7:30 గంటల వరకు కొనసాగింది. పదోన్నతుల షెడ్యూల్ విడుదల కంటే ముందుగానే సీనియారిటీ జాబితాను సిద్ధం చేస్తున్నారు.

భారీగా గంజాయి పట్టివేత

న్యూశాయంపేట: విజయనగరం నుంచి మహారాష్ట్రకు భారీ మొత్తంలో తరలిస్తున్న 8.655 కిలోల గంజాయిని మిల్స్‌కాలనీ పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం మహమ్మద్ అశ్రఫ్, షేక్ రహీం, అబ్బని పటేల్, ప్రవీణ్ తాడే, రాజ్ ఠాకూర్.. మొహిన్ సూచనల మేరకు విజయనగరం రైల్వే స్టేషన్ వద్ద గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు వద్ద గంజాయి బ్యాగులు తీసుకున్నారు. వరంగల్ మీదుగా మహారాష్ట్రకు వెళ్తున్నారు. వరంగల్ స్టేషన్ నుంచి బయటకు వస్తూ పోలీసులను చూసి వారు పారిపోవడానికి యత్నించారు. వారిని పోలీసులు పట్టుకుని విచారించగా, వారి దగ్గర నుంచి 8.655 కిలోల గంజాయి లభ్యమైందని, దాని విలువ సుమారు. రూ.4 లక్షల 32వేల 750 ఉంటుందని ఎస్సై తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి జైలుకు పంపినట్లు వివరించారు.

రాష్ట్రస్థాయి సదస్సు

మడికొండ : మడికొండలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం రాష్ట్రస్థాయి 10వ నేత్ర వైద్యనిపుణుల సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సు మూడ్రోజుల (11,12,13) పాటు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాలనుంచి వెయ్యి మందికి పైగా నేత్ర వైద్యులు పాల్గొన్నారు. అనుభవాలు, నూతన వైద్య పద్ధతులను పంచుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా వరంగల్‌కు చెందిన డాక్టర్ కె.రాజ విజయ్‌కుమార్ బాధ్యతలు స్వీకరిస్తారని వారు తెలిపారు. సదస్సులో ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ భరత్‌కుమార్, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ అయిత రాజరవీంద్ర, సెక్రటరి డాక్టర్ ప్రవీణ్, వైద్యులు రాజ్‌కుమార్, వేణుమాధవ్, పరమేశ్వర్‌రావు, రాజలింగం, రిషి స్వరూప్, భద్రినారాయణ, హరికిషన్ పాల్గొన్నారు.

రేప్ కేసులో ఐదేళ్ల జైలు

వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం మండల పరిధిలోని వాడగూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి రేప్ కేసులో ఐదేళ్ల జైలుశిక్ష పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వెంకటాపురం సీఐ బండారి కుమార్ వివరాల ప్రకారం రేప్ కేసులో జాడి రోశయ్యకు ములుగు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్‌వీపీ సూర్యచంద్రకళ శుక్రవారం ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చారు.

పెరుగుతున్న గోదావరి



వాజేడు: మండల కేంద్రం సమీపంలో రహదారిపైకి చేరిన గోదావరి వరద



వాజేడు: పూసూరు, ఎడ్జర్లపల్లి మధ్య నీట మునిగిన రహదారి



వాజేడు వద్ద వరద నీటిలోకి వెళ్లకుండా ట్రాక్టర్‌ను అడ్డుగా పెడుతున్న డ్రైవర్

- నీట మునిగిన రహదారులు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు

వాజేడు: వరద నీరు ఉధృతంగా వస్తుండడంతో గోదావరి వరద ప్రవాహం పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటితో గోదావరి మట్టం పెరగడంతో ములుగు జిల్లా వాజేడు మండలంలో రహదారులు పలు చోట్ల ముంపునకు గురి కావడంతో అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండల పరిధిలోని పేరూరు, కృష్ణాపురం గ్రామాల మధ్యన మోడి కుంట వాగు ద్వారా రహదారిపైకి వరద నీరు చేరడంతో కృష్ణాపురం, కడేకల్, పెద్ద గంగారం, చంద్రుపట్ల, టేకులగూడెం, టేకులగూడెం కాలనీ గ్రామాలు, పేరూరుకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ గ్రామాల ప్రజలు పేరూరుకు రావాలంటే జాతీయ రహదారిపై నుంచి చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. అదేవిధంగా మండల కేంద్రం సమీపంలో కొంగల వాగు ద్వారా వచ్చిన గోదావరి వరద రహదారిని ముంచింది. దాంతో వాజేడు, గుమ్మడిదొడ్డి గ్రామాల మధ్యన రాకపోకలు నిలిచాయి. కొంగల వాగు అవతల ఉన్న సుమారు 25 గ్రామాల ప్రజలు వాజేడు మండల కేంద్రానికి రావాలంటే జగన్నాథపురం మీదుగా రావాలి. మండల పరిధిలోని పూసూరు, ఏడ్జర్లపల్లి గ్రామాల మధ్యన ఉన్న వంతెనపైకి వరద నీరు చేరడంతో ఇక్కడ కూడా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఏడ్జర్లపల్లి, బొమ్మనపల్లి, ముత్తారం, కొత్తూరు గ్రామాల ప్రజలు చుట్టూ తిరిగి వెంకటాపురం(కె) మీదుగా వాజేడుకు రావాల్సి ఉంది. కోయ వీరాపురం గ్రామ సమీపంలో చాకలి వాగు వద్ద రహదారిపైకి గోదావరి చేరడంతో గ్రామస్తులు చీకుపల్లి మీదుగా ప్రయాణించాల్సి వస్తోంది.



పూసూరు హైలెవల్ బ్రిడ్జి వద్ద గోదావరి వరద ఉధృతి

పెరుగుతున్న నీటి మట్టం

ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని పేరూరు వద్ద గోదావరి వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. గురువారం సాయంత్రం గోదావరి నీటి మట్టం 14.28 మీటర్లు ఉండగా, శుక్రవారం సాయంత్రానికి 15.42 మీటర్లకు చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వస్తుండడంతో గోదావరి నీటి మట్టం పెరుగుతున్నట్లు సీడబ్ల్యూసీ సిబ్బంది తెలిపారు. పూసూరు హైలెవల్ బ్రిడ్జి వద్ద గోదావరి వరద పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. ఇప్పటికే పలు చోట్ల రహదారులు నీట మునిగాయి. మండల అధికారులు అప్రమత్తమై మండలంలోని పునరావాస కేంద్రాలను శుభ్రం చేసి సిద్ధం చేశారు. వాగులు వంకల వద్దకు ప్రజలు వెళ్లకుండా రహదారులపై ట్రాక్టర్లు అడ్డంగా ఉంచారు.

అప్రమత్తమైన అధికారులు

గోదావరి వరద అంతకంతకు పెరుగుతుండడంతో పాటు పలు చోట్ల రహదారులను ముంచెత్తడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. వరదను పరిశీలించిన తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు, ఆర్ఐ కుమారస్వామి.. గ్రామ పంచాయతీ సిబ్బందిని ఎక్కడికక్కడ అప్రమత్తం చేశారు. రహదారులపైకి వరద నీరు చేరడంతో నీటిలోకి ఎవరూ వెళ్లకుండా ట్రాక్టర్లు అడ్డంగా పెట్టడమే కాకుండా కర్రలతో అడ్డుగా కంచె కట్టారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.

వరద ఉధృతి



సమ్మక్క సాగర్ బ్యారేజీలోకి భారీగా చేరుతున్న వరద నీరు

- ఎగువ నుంచి 7,35,720 క్యూసెక్కుల నీరు
- బ్యారేజీ వద్ద 59 గేట్లు ఎత్తి అంతేమొత్తంలో దిగువకు..



తుపాకులగూడెం సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద గోదావరి ఉగ్ర రూపంలో ప్రవహిస్తోంది. బ్యారేజీలోకి ఎగువ నుంచి భారీగా వరదలు చేరడంతో నిండుకుండను తలపిస్తూ దిగువకు వెళ్తోంది. వారం రోజుల నుంచి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో సరస్వతి, లక్ష్మీ బ్యారేజీలలోకి భారీగా వరద నీరు చేరడంతో అక్కడ బ్యారేజీల గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. దాంతో దిగువన ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీలోకి భారీగా వరద చేరుతోంది. ఈ క్రమంలో తుపాకులగూడెం సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద శుక్రవారం గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ నుండి 7,35,720 క్యూసెక్కుల నీరు చేరుతోంది. బ్యారేజీ వద్ద అన్ని గేట్లు 59 ఎత్తి అదేమోతాదులో దిగువకు నీటిని వదులుతున్నారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 83.మీటర్లకుగాను 82.10 మీటర్లుగా నమోదవుతోంది. బ్యారేజీకి ఎగువన గుట్టల గంగారం పరిధిలో ఉన్న జె.చొక్కారావు ఎత్తిపోతల వద్ద ఫేజ్ -1లో రెండు మోటార్లకు గాను 1 మోటారు తోపాటు ఫేజ్ -3లో 6 మోటార్లకుగాను రెండు మోటార్ల ద్వారా 760 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎత్తిపోతల వద్ద ప్రస్తుతం 83 మీటర్ల నీటి మట్టం కొనసాగుతోంది.

మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువలో..



రామన్నగూడెం గోదావరి వద్ద సిద్ధంగా ఉన్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

- రామన్నగూడెం వద్ద 14.48 మీటర్ల మేర వరద ప్రవాహం
- రంగంలోకి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

ఏటూరునాగారం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి వరద గంట గంటకు పెరుగుతోంది. మండలంలోని రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద గోదావరి నీటి మట్టం శుక్రవారం ఉదయం 10 గంటలకు 14.09 మీటర్లు ఉండగా, రాత్రి 8 గంటలకు 14.48 మీటర్లకు చేరింది. గంటగంటకు వరద నీరు పెరుగుతుండడంతో మొదటి ప్రమాద హెచ్చరికకు (14.80 మీటర్లు) చేరువలో వరద ప్రవాహం కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను గోదావరి చుట్టూ పక్కల గ్రామాల్లో సిద్ధం చేసి ఉంచారు. వారి వద్ద పడవలు, లైఫ్‌జాకెట్లతో పాటు రబ్బర్ బోట్లను ఉంచారు. ఎక్కడైనా విపత్తు ప్రమాదం జరిగితే వెంటనే పోలీసులు, రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులకు ప్రజలు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు. కోయగూడ ఎల్లాపురం గ్రామంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలున్నాయని, ఎలాంటి భయాందోళనకు గ్రామస్తులు గురికావొద్దని అవగాహన కల్పించినట్లు రామన్నగూడెం పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ తెలిపారు.



రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి

ప్రాణహిత పరవళ్లు

- కాళేశ్వరం ఘాట్ వద్ద 11.790 మీటర్ల నీటిమట్టం
- మేడిగడ్డ బ్యారేజీ వద్ద 8.68 లక్షల క్యూసెక్కుల వరద ఇన్‌ఫ్లో



కాళేశ్వరం పుష్కర ఘాట్ మెట్లను తాకుతూ ప్రవహిస్తున్న వరదనీరు

కాళేశ్వరం: మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాణహిత నది పరవళ్లు తొక్కుతోంది. మహారాష్ట్ర నుంచి వచ్చే ప్రాణహిత వరద కాళేశ్వరం వద్ద గోదావరితో కలిసి నాలుగు రోజులుగా ఉగ్రరూపం దాల్చుతూ ఉప్పొంగి ప్రవహిస్తోంది. తెలంగాణలో అంతగా వర్షాలు లేకపోవడంతో గోదావరిలో అంతగా నీరు లేదు. మహారాష్ట్ర ఎగువ నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద 11.790 మీటర్ల ఎత్తులో నీటిమట్టం దిగువకు ప్రవహిస్తోంది. త్రివేణి సంగమం వద్ద సరస్వతి నది పుష్కరాల సందర్భంగా ఏర్పాటు చేసిన రెండు జ్ఞానదీపాలు నీటమునిగి కొంతమేర మాత్రమే పైకి కనిపిస్తున్నాయి. రాత్రివరకు పూర్తి స్థాయిలో మునిగిపోనున్నాయి. దిగువన ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీకి వరద ప్రవాహం 8.68 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రూపంలో వచ్చి చేరుతుండగా, 85గేట్లు ఎత్తివేయడంతో అదే స్థాయిలో నీటిని దిగువకు ఇంజనీరింగ్ అధికారులు విడుదల చేస్తున్నారు. మహారాష్ట్రలోని గోసిపుర్డ్ డ్యామ్ నీరు వదలడంతో రాత్రి వరకు మరింత వరద నీరు చేరుతుందని తెలిసింది.

టేకులగూడెం వంతెన మూసివేత

ములుగు రూరల్: గోదావరి వరద ఉధృతి నేపథ్యంలో తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల అనుసంధాన జాతీయ రహదారి నంబర్ 163పై టేకులగూడెం వంతెనను మూసి వేసినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా వాజేడు మండలం పేరూరు పోలీస్‌స్టేషన్ పరిధి టేకులగూడెం శివారులో రేగమాగు వాగు పొంగి వంతెన మీదుగా వరదనీరు ప్రవహిస్తోందని పేర్కొన్నారు. వరద ఉధృత్తి కారణంగా వంతెనపై ప్రయాణాలను నిషేధించినట్లు తెలిపారు. ఈ క్రమంలో సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసరమైతే పోలీసుల సహకారం తీసుకోవాలని పేర్కొన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తే భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం మీదుగా వెళ్లాలని తెలిపారు.

విద్యుత్ అంతరాయాలు తగ్గాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ: విద్యుత్ అంతరాయాలు తగ్గాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల ఎస్ఈ, డీఈ, ఏడీఈ, ఏఈ, ఎస్ఏఓ, ఏఏఓలతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సర్కిల్, డివిజన్ల వారీగా ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ 16 సర్కిళ్ల పరిధిలో ముందుగా వేయి ఫాల్ట్ ప్యాసెజ్ ఇండికేటర్లు 15 నుంచి 20 కిలోమీటర్ల పరిధిలో ఉండే పొడవాటి లైన్లలో అమర్చుతున్నట్లు తెలిపారు. తద్వారా విద్యుత్ అంతరాయాలను త్వరగా గుర్తించి పరిష్కరించనున్నట్లు వివరించారు. ఈ నెలలో 30 సబ్‌స్టేషన్లలో, వచ్చే నెలలో 120 సబ్ స్టేషన్లలో రియల్ టైం ఫీడర్ మానిటరింగ్ పూర్తి చేయాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న లూజు లైన్‌లు, వంగిన స్తంభాలు, తుప్పు పట్టిన స్తంభాలు, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెలు, లైన్ క్రాసింగ్, డబుల్ ఫీడింగ్‌ను గుర్తించి ఆ సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. ఈ నెలాఖరు వరకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందించే లైన్ల పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు టి.మధుసూదన్, సి.ప్రభాకర్, చీఫ్ ఇంజనీర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, కె.తిరుమల్ రావు, రాజు చౌహాన్, అశోక్, వెంకట రమణ, ఆర్.చరణ్ దాస్, జనరల్ మేనేజర్లు వేణుబాబు, కృష్ణ మోహన్, వాసుదేవ్, సత్యనారాయణ, అన్నపూర్ణ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బకాయిలపై నిర్లక్ష్యం తగదు

- ప్రతినెలా 10లోపు వసూలు చేయాలి
- డీఎంఓల సమావేశంలో జేడీ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

వరంగల్ చౌరస్తా: మార్కెట్ ఫీజుల బకాయి ఫీజుల వసూలులో ఏ మాత్రం నిర్లక్ష్యం తగదని మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ ఉప్పల శ్రీనివాస్ హెచ్చరించారు. వరంగల్ లక్ష్మీపురంలోని జేడీ కార్యాలయంలో డీడీఎంఓలతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ ఫీజు పాత బకాయిలతోపాటు కొత్తగా ఫీజును ప్రతినెలా 10వ తేదీలోపు వసూలు చేయాలని సూచించారు. చెక్ పోస్టులు నిర్దేశిత టార్గెట్లను వసూలు చేయాలన్నారు. సమావేశంలో డీడీఎం ఒడితల పద్మావతి, డీఎంఓ పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక జనాభాతో అనర్థాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద, అధికారులు

- వరంగల్ కలెక్టర్ సత్యశారద

న్యూశాయంపేట: అధిక జనాభాతో అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ జనాభా దినోత్సవంలో ఆమె మాట్లాడారు. పెరుగుతున్న జనాభా అనేక అనర్థాలకు కారణం అవుతుందన్నారు. ఈ మేరకు జనాభా నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జనాభా నియంత్రణ లేనిచో సామాజిక వ్యత్యాసాలు వస్తాయని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి జనాభా పెరుగుదలతో వచ్చే సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా జనాభా నియంత్రణలో కృషిచేసిన వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బందిని సన్మానించారు. కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించిన దంపతులకు ప్రోత్సాహక బహుమతులను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం జనాభా నియంత్రణపై అవగాహన కల్పించడానికి రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్ఓ విజయలక్ష్మి, డీఎంహెచ్ఓ సాంబశివరావు, డిప్యూటీ డీఎంహెచ్ఎచ్ఓలు ప్రకాశ్, కొమురయ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జోధ్‌పూర్ వ్యవసాయ మార్కెట్ సందర్శన



జోధ్‌పూర్ మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తుల క్రయ విక్రయాలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

వరంగల్ చౌరస్తా: రాజస్థాన్ రాష్ట్రంలోని జోధ్‌పూర్ వ్యవసాయ మార్కెట్ యార్డును తెలంగాణ రైతు సంఘం ప్రతినిధులు శుక్రవారం సందర్శించారు. జోధ్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి రాంసింగ్ సిసోడియా, పండ్లు, కూరగాయల మార్కెట్ సెక్రటరీ దుర్గా రామ్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రాజేందర్ పరివార్, కార్యదర్శి ధర్మేందర్ బండారి, కార్మిక నాయకులు సకూర్ ఘోరీతో సంఘం జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్ రావు, ప్రతినిధులు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అక్కడ రైతుల నుంచి పంట దిగుమతి చార్జీలు మినహా ఎలాంటి మార్కెట్ చార్జీలు వసూలు చేయడం లేదని, మార్కెట్ సెస్ రూ.100కు 1.50 రూపాయలు వసూలు చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్మిక చార్జీలు నూటికి 3.60 రూపాయలు పంట కొనుగోలుదారుడు చెల్లిస్తాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మోర్తాల చందర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ మార్కెట్లలో పంటలను విక్రయించే కమిషన్ ఏజెంట్లు అదనంగా రైతుల నుంచి కమిషన్, మునిం, దానం, ధర్మం కూటుకు కిలో పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. హర్యానా, పంజాబ్, చండీగఢ్, రాజస్థాన్ రాష్ట్రాల్లోని వ్యవసాయ మార్కెట్ చట్టాల మాదిరిగా తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ చట్టాలను సవరించాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు సంగతి సాంబయ్య, చంద్రశేఖర్, మాదం తిరుపతి, సందెపోగు ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో యువత వీరంగం

- ఇద్దరిపై దాడి.. ఒకరి పరిస్థితి విషమం
- ఎంజీఎం ఆస్పత్రికి తరలింపు



కేడల నరేష్



బజ్జూరి వంశీ

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో యువత గంజాయి మత్తులో వీరంగం సృష్టిస్తోంది. అర్ధరాత్రి వరకు బైకుల హారన్ల మోత, కేరింతలతో రహదారులపై ఆకతాయిలు చక్కర్లు కొడుతున్నారు. ఇదేంటని ప్రశ్నించిన వారిపై విరుచుకు పడుతున్నారు. ఈ క్రమంలో బీట్ పోలీసులు ఉన్నా లేనట్లేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. అడిగింది ఇవ్వకపోతే చిరువ్యాపారులపై మత్తులో ఉన్న పోకిరీలు విచక్షణ రహితంగా దాడికి తెగబడుతున్నారు. ఈ తరహా ఘటన గురువారం అర్ధరాత్రి వరంగల్ శంభునిపేటలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. రంగశాయిపేట గవిచర్ల క్రాస్ రోడ్డులోని ఓ ఐస్‌క్రీమ్ బండి వద్ద కొంతమంది ఐస్‌క్రీమ్ తిన్నారు. డబ్బులు ఇవ్వాలని అడిగితే ఆ చిరు వ్యాపారితో పాటు అడ్డుకోబోయిన కేడల నరేష్, బజ్జూరి వంశీపై ఆకతాయిలు దాడికి చేశారు. ఈ దాడిలో కేడల నరేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న స్థానిక మిల్స్ కాలనీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించినట్లు సమాచారం.

మృతదేహం మా వారిది కాదు..

- దహన సంస్కారాలు చేసే సమయంలో కుటుంబ సభ్యుల గుర్తింపు
- తిరిగి ఎంజీఎం ఆస్పత్రికి తరలింపు
- పోలీసుల వినతి మేరకు పోస్టుమార్టం లేకుండా బంధువులకు అప్పగించాం
- ఎంజీఎం ఆర్ఎంఓ శశికుమార్ వెల్లడి



ఆందోళన చెందుతున్న కుటుంబ సభ్యులు, (ఇన్‌సెట్‌లో) మృతదేహం

రాయపర్తి: 'రోడ్డు ప్రమాదంలో నీ భర్త మృతిచెందాడ'ని పోలీసులు సమాచారం అందించడంతో వరంగల్ ఎంజీఎంకు వెళ్లిన కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతదేహాన్ని తీసుకెళ్లి దహన సంస్కారాలు చేసే క్రమంలో మృతదేహం తమవారిది కాదని గుర్తించి.. తిరిగి ఎంజీఎం ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఈ విచిత్ర ఘటన శుక్రవారం వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మైలారం గ్రామానికి చెందిన గోక కుమారస్వామి(55), రమకు ముప్పయి ఏళ్లక్రితం వివాహమైంది. వారికి ఒక కూతురు. ఇరవై ఏళ్ల క్రితం కుమారస్వామి మతిస్థిమితం కోల్పోగా అప్పటినుంచి రమ వేరుగా ఉంటున్నారు. అతను మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణకేంద్రంలో యాచిస్తూ జీవిస్తున్నాడు. తొర్రూరులో ఈనెల 09వ తేదీన రోడ్డుపక్కన అపస్మారకస్థితిలో పడి ఉండగా స్థానికులు, పోలీసుల సాయంతో అంబులెన్స్‌లో ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ మరుసటి రోజు గురువారం మృతిచెందాడు. ఈ క్రమంలో ఎంజీఎంనుంచి పోలీసులు 'నీ భర్త చనిపోయాడని' మైలారానికి చెందిన గోక రమకు సమాచారం అందించారు. ఆస్పత్రికి వెళ్లిన రమ, కుటుంబ సభ్యులకు మార్చురీనుంచి చాపతో చుట్టిన మృతదేహాన్ని అప్పగించారు. మృతదేహాన్ని అంబులెన్స్‌లో నేరుగా మైలారంలోని దహనసంస్కారాలు చేసే స్థలానికి తీసుకొచ్చారు. కిందికి దించి చాప విప్పి చూడగా కుమార్తె స్వప్న ఆ మృతదేహాన్ని చూడగా తన తండ్రి చేతిపై శ్రీ అనే పచ్చబొట్టు ఉంటుందని, ఈ మృతదేహానికి పచ్చబొట్టు లేదని, తమ నాన్న కాదని తేల్చిచెప్పింది. భార్య, బంధువులు సైతం చూసి తమవారిది కాదని చెప్పడంతో తిరిగి మృతదేహాన్ని అదే అంబులెన్స్‌లో ఎంజీఎంకు తరలించారు. రమ తన భర్తను చాలా ఏళ్లుగా చూడకపోవడం.. చాపలో చుట్టి ఇవ్వడం వల్ల గుర్తించలేకపోయినట్లు కొందరు అంటున్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కాగా, ఆ మృతదేహం ఎవరిది అన్నది గుర్తించాల్సి ఉంది.

పోలీసుల వినతి మేరకే...

ఎంజీఎం : ఈ నెల 9వ తేదీన అపస్మారకస్థితిలో ఉన్న ఓ వ్యక్తిని ఎంజీఎంకు తీసుకువచ్చారని, చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు ఎంజీఎం ఆర్ఎంఓ శశికుమార్ తెలిపారు. కాగా, సదరు వ్యక్తి మృతదేహం రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన కుమారస్వామిగా పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. పోస్టుమార్టం లేకుండా అప్పగించాలనే పోలీసుల వినతి మేరకు ఆ మృతదేహాన్ని భార్య, బంధువుల అంగీకారం మేరకు అప్పగించినట్లు ఆర్ఎంఓ తెలిపారు. మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లిన కుటుంబ సభ్యులు తమది కాదని పేర్కొని తిరిగి ఎంజీఎం మార్చురీకి తరలించినట్లు వెల్లడించారు.